క్లుప్తంగా

అధికారులతో జెడ్సీ సమీక్ష సమావేశం



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న జెడ్సీ మమత

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో పారిశుద్ధ్యం, ట్రేడ్ లైసెన్స్, ఆస్తి పన్ను వసూళ్లపై అధికారులతో జోనల్ కమిషనర్ వి.మమత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్సీ మమత మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆటోలు ప్రతి రోజూ వారికి కేటాయించిన ప్రాంతాల నుంచి చెత్త సేకరించే విధంగా చూడాలన్నారు. ఏవైనా ఆటోలు ఎక్కువ రోజులు గైర్హాజరు అయితే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య కార్మికులు వారి పనివేళల్లో వారికి కేటాయించిన ప్రాంతాల్లో పనులు నిర్వహించేలా చూసే బాధ్యత ఎస్ఆర్ఏలు, సహాయ వైద్యాధికారులదే అన్నారు. అన్ని సర్కిళ్లలోని అన్ని దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా చూడాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్ల టార్గెట్ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సర్కిళ్ల వారీగా ఆస్తి పన్ను వసూళ్లను త్వరగా పూర్తి చేయాలని ఆమె సూచించారు.

నియామకం

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడిగా వేముల విపుల్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా అభినవ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రాజారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్లుగా శ్రవణ్, అరుణ్, షెబేజ్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ నిర్మాణంలో ప్రతీ విద్యార్థి పాలుపంచుకోవాలన్నారు. బీఆర్ఎస్‌వీ నాయకులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా పనిచేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేయాలని సూచించారు.

సీఎంను కించపరుస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

ఆల్విన్‌కాలనీ: ముఖ్యమంత్రి కేసీఆర్ గౌరవానికి భంగం కలిగించేలా పోస్టింగ్స్ పెడుతున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 18 ఫేస్‌బుక్ అకౌంట్స్, 24 ట్విట్టర్ అకౌంట్స్, 4 ఇన్‌స్టాగామ్ అకౌంట్లపై కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం టీఎస్‌టీఎస్ చైర్మన్ పాటిమీది జగన్మోహన్‌రావు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియా కమ్యూనిటీ స్టాండర్డ్స్‌ను ఉల్లంఘించిన ఈ అకౌంట్‌లను వెంటనే బ్లాక్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఇలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహాబేగం తదితరులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేస్తున్నామని కార్పొరేటర్ సబిహాబేగం పేర్కొన్నారు. ఆమె శనివారం డివిజన్ పరిధిలోని పండిట్ నెహ్రూ నగర్‌లో నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మట్టి పోసి రోడ్డును లెవెల్ చేయాలని, ఎక్కువ కాలం ప్రజలకు ఉపయోగపడేలా నాణ్యమైన మెటీరియల్ వాడాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు.

మున్నూరుకాపు సంఘం శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్‌గా పద్మ

ఆల్విన్‌కాలనీ: మున్నూరుకాపు సంఘం శేరిలింగంపల్లి ఇన్‌చార్జిగా కూకట్‌పల్లి డివిజన్‌కు చెందిన కమటం పద్మ, బోయినపల్లి డివిజన్ అధ్యక్షులుగా ఆకుల సంగీత శనివారం నియామకమయ్యారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి అహర్నిశలు పాటుపడతానన్నారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి శాఖ చైర్‌పర్సన్ ఆకుల లలిత, సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్య, గ్రేటర్ అధ్యక్షుడు మహేందర్, రాష్ట్ర కన్వీనర్ బండి పద్మలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడా పోటీల విజేతలకు బహుమతులు

మోతీనగర్: సనత్‌నగర్ జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో ఈ నెల 23 నుంచి 25 వరకు న్యూటన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ పోటీల్లో రహమత్‌నగర్, గంగానగర్, శ్రీరాంనగర్, మోతీనగర్, వివేకానంద నగర్ బ్రాంచ్‌ల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ పాఠశాల డైరెక్టర్‌లు పి.రాజేష్‌రెడ్డి, పి.రమేష్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు ఉపాధ్యాయుల సహకారంతో క్రీడా పోటీలు నిర్వహించారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, టగ్ ఆఫ్ వార్, రన్నింగ్‌లో పోటీలు నిర్వహించారు. నిర్వాహకులు విజేతలకు బహుమతులు అందజేసి విద్యార్థులను అభినందించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారమేది..?

- భరత్‌నగర్‌లో తీవ్రమవుతోన్న తాగునీటి సమస్య
- లో ప్రెషర్ సమస్యతో పాటు కలుషిత నీరు సరఫరా అవుతోన్న వైనం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- శాశ్వత పరిష్కారం చూపని అధికారులు



భరత్‌నగర్‌లోని వాటర్ ట్యాంక్



మ్యాన్‌హోల్‌లో అపరిశుభ్రంగా ఉన్న నీరు



తుప్పు పట్టి పెచ్చులూడుతున్న దృశ్యం

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ కాలనీలో తాగునీటి సమస్య జఠిలంగా మారుతోంది. కలుషిత నీటి సమస్య అధికంగా ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. పలు ప్రాంతాల్లో లో ప్రెషర్‌తో నీటి సరఫరా అవుతోంది. పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పరిష్కరిస్తామని చెప్పడం తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి ట్యాంకర్ నిర్మించి 30 సంవత్సరాలు కావడంతో ఎప్పుడు పడిపోతుందో అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- భరత్‌నగర్ కాలనీలోని తాగునీటి ట్యాంకర్ 1992లో దివంగత మాజీ మంత్రి పీజేఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రస్తుతం బీముల వద్ద ఇనుము తుప్పు పట్టి పెచ్చులు ఊడుతోంది. ట్యాంక్ కింది భాగంలో కొన్ని చోట్ల లీకేజీ అవుతోంది. దీంతో ఎప్పుడు పడిపోతుందో అని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు మాత్రం ఇంకా 10 సంవత్సరాల సర్వీస్ ఉందని చెబుతున్నారు.
- కాలనీలోని తాగునీటి వాల్వ్ మ్యాన్‌హోల్ వద్ద నీరు లీకేజీ కావడంతో పాటు డ్రైనేజీ నీరు కలుస్తోంది. మ్యాన్‌హోల్ చెత్తా చెదారంతో నిండిపోవడంతో అధికారులు శుభ్రం చేశారు తప్ప మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకోలేదు. సమీప ప్రాంతాల్లోని హోటల్స్ వారు ఆయిల్, పిండి వ్యర్థాలను మ్యాన్‌హోల్‌లో కలుపుతున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మురుగు నీరు కలిసే చోట మరమ్మతులు చేసి తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
- రోజు విడిచి రోజు తాగునీరు వస్తున్నప్పటికీ కాలనీలోని ప్రతీ ఇంటికి మొదట 5 నుంచి 10 నిముషాల వరకు మురుగు నీరు సరఫరా అవుతోందని, ఆ నీటిని వదిలేసిన తర్వాతే నీళ్లు పట్టుకుంటున్నామని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఆ మురుగు నీరు నుంచి తీవ్రమైన దుర్వాసన వస్తోందని చెబుతున్నారు.
- గంట సేపు వదిలే నీటిలో 5 నుంచి 10 నిమిషాలు మురుగు నీరు విడిచి పెట్టేందుకే సరిపోతోంది. స్థానికులు పోటాపోటీగా మోటార్లు బిగించడంతో కొద్ది మందికి మాత్రమే సరిపడా నీరు వస్తోంది. మిగిలిన వారికి లో ప్రెషర్‌తో ఒక డ్రమ్ము నిండేందుకే అరగంట పడుతోందని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం

మ్యాన్‌హోల్‌లో ఉన్న మురుగు నీటిని గతంలోనే శుభ్రం చేశాం. తిరిగి మురుగు కలుస్తుంటే తగిన చర్యలు తీసుకొని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం. వాటర్ ట్యాంక్‌ను ఉన్నతాధికారులు పరీక్షించి మరో 10 సంవత్సరాల వరకు ఉపయోగంలో ఉంటుందని చెప్పారు. లో ప్రెషర్ సమస్య ఉన్న ప్రాంతాల్లో మరో 10 నిమిషాల ఎక్కువ సమయం నీటిని సరఫరా చేస్తున్నాం.

– విలియం, వాటర్ వార్క్స్ మేనేజర్

త్వరలోనే పెండింగ్ పనులు పూర్తి చేస్తాం



సీసీ రోడ్డు నిర్మించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఖాజానగర్‌లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించనున్న సందర్భంగా ఆ ప్రాంతాన్ని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఏఈ శ్రావణితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాజానగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, అవి పూర్తి కాగానే సీసీ రోడ్డు పనులు చేపడతామన్నారు.రోడ్డు నిర్మాణ సమయంలో స్థానికులు నాణ్యతను పరిశీలించాలని సూచించారు. అనంతరం ఖాజానగర్‌లో పర్యటనకు వెళ్లగా కుక్కల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన వెంటనే వెటర్నరీ డిపార్టుమెంట్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ మైనార్టీ అధ్యక్షుడు ఎండీ ఖైసర్, ఎస్‌టీ సెల్ అధ్యక్షుడు వెంకట్‌నాయక్, షౌకత్‌ఆలీ మున్నా, పోశెట్టి గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సమ్మద్, ఖాజా, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు అధికారుల చర్యలు



పరికి చెరువులో దోమల మందు పిచికారీ చేస్తున్న ఎంటమాలజీ సిబ్బంది



దోమల నివారణకు తులసినగర్‌లో ఫాగింగ్ చేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ తులసినగర్‌లో మురుగు నీరు రోడ్లపైకి వస్తోంది. దీంతో పాటు పరికి చెరువులో గుర్రపు డెక్క పేరుకుపోయి దోమలు వృద్ధి చెందుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీంతో నెల 26న డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం పరికి చెరువులో డ్రోన్లతో దోమల మందు పిచికారీ చేశారు.గంబుజా చేపలను సైతం చెరువులో వదిలి దోమల ఎదుగుదలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.అదే విధంగా తులసినగర్ పరిసర ప్రాంతాల్లో దోమల నివారణకు పొగతో కూడిన ఫాగింగ్ చేపట్టారు.ఇంటింటికీ తిరుగుతూ నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో చెత్తా చెదారం పేరుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు అవగాహన కల్పించారు. సాక్షి కథనానికి స్పందించి చెరువులో, రోడ్లపై దోమల మందు పిచికారీ, ఫాగింగ్ చేపట్టినందుకు ప్రజలు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తున్నాం



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ



ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్‌లో సీసీ రోడ్డు పనులకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.1 కోటి 10 లక్షలతో సీసీ రోడ్డు పనులను చేపడుతున్నామన్నారు. కూకట్‌పల్లి డివిజన్‌లో ఇప్పటికే దాదాపు అన్ని పనులు పూర్తి చేశామని, మిగిలి ఉన్న పనులను వేగంగా పూర్తి చేస్తామన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని 9 చెరువులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, అందులో భాగంగా ఎస్టీపీ ప్లాంట్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి లేకుండా నియోజకవర్గంలో ఇప్పటికే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పార్కులు, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలకు ఎక్కడా ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పనుల పరిశీలన..

కూకట్‌పల్లిలో నూతనంగా నిర్మిస్తున్న వెటర్నరీ ఆస్పత్రి పనులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఏదైనా ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. త్వరలో నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బాలానగర్: బాలానగర్ అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఐసీడీఓ కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు అధికారి సీహెచ్ హెప్సిబాకు శనివారం వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోర్డులను రద్దు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని అంగన్‌వాడీ ఉద్యోగుకు గ్రాట్యుటీ చెల్లించి, వేతనంలో సగం పెన్షన్ నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఉపాధ్యాయులతో సమానంగా అంగన్‌వాడీ ఉద్యోగులకు వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత వంటి తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆన్‌లైన్‌లో పనిచేయడానికి వీలుగా ఐపాడ్‌లను అందజేయాలన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు ఆసరా, కల్యాణలక్ష్మి తదితర సంక్షేమ పథకాలను అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

జేఎన్‌టీయూహెచ్‌లో 'పరిసరాల పరిశుభ్రత'



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొని జేఎన్‌టీయూహెచ్‌లోని కిన్నెర హాస్టల్ ప్రాంతంలో పరిసరాలను శుభ్రం చేశారు. ప్రిన్సిపాల్ ఎ.జయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.వి.నర్సింహారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.ఎ.బలరాంనాయక్, ప్రొఫెసర్లు టి.బాలనర్సయ్య, డా.బి.రమేష్ చంద్ర, ప్రొ.సుప్రీతి, డా.హేమలత, డా.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేత

కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీలోని రాజేశ్వరి వృద్ధాశ్రమానికి గచ్చిబౌలిలోని సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ మేరకు ఆశ్రమ నిర్వాహకురాలు రాజేశ్వరికి కంపెనీ సీఎస్ఆర్ ఎగ్జిక్యూటివ్ సురేష్ సరుకులు అందజేశారు. సరుకులు అందజేసిన సైబేజ్ కంపెనీ వారికి రాజేశ్వరి ధన్యవాదాలు తెలిపారు. సురేష్ మాట్లాడుతూ అనాథ ఆశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు చేయూత అందించడంలో సైబేజ్ కంపెనీ ముందుంటుందన్నారు. సైబేజ్ కంపెనీ ఉద్యోగులు కిషోర్, సింధు, వినయ, సాయిరాం, మనోజ్, సాయిదీప్, దేవేంద్ర, సాయిరాం లు పాల్గొన్నారు.

భాషా పండితులకు న్యాయం చేయండి

కూకట్‌పల్లి: భాషా పండితులపై వివక్షను నిరసిస్తూ 9, 10 తరగతుల బోధనను బహిష్కరిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా విద్యాధికారికి జేఏసీ నేతలు నోటీస్ అందించారు. భాషా పండితులను వెట్టిచాకిరి నుంచి విముక్తి కలిగించడం కోసం పదోన్నతులు కల్పించి న్యాయం చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు బోధనను బహిష్కరిస్తున్నట్లు వారు తెలిపారు. ఫిబ్రవరి 1నుంచి బోధన నిలిపివేస్తున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. భాషా పండితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తూనే ఉంటామని వారన్నారు.

నాలా బ్రిడ్జిపై చెత్త

మీతో సాక్షిగా





ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీ పైపులైన్ రోడ్డులోని బ్రిడ్జిపై చెత్తా చెదారం పడేస్తున్నారు. జీహెచ్ఎంసీ సిబ్బంది సైతం చెత్తను తీసుకువచ్చి ఉదయం ఇక్కడే వేసి సాయంత్రం తరలిస్తున్నారు. జేఎన్‌టీయూ నుంచి జగద్గిరిగుట్ట మీదుగా కుత్బుల్లాపూర్ వెళ్లే రహదారి ఇది. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చెత్తను రోడ్లపై వేయకూడదని తెలిసినా జీహెచ్ఎంసీ సిబ్బంది సైతం ఇక్కడే వేస్తుండడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భిక్షాటన చేసేవాళ్లు ఇదే చెత్తలో నుంచి ఆహార పదార్థాలను తీసుకుని అక్కడే కూర్చొని తింటున్నారు. రోడ్డున వెళ్లే వారు ఇది చూసి మనోవేదనకు గురవుతున్నారు. రోడ్లపై వేసిన చెత్తతో దుర్వాసన వస్తోంది. రహదారిపై ప్రయాణించాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి ఇక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి.

–దినేష్, కూకట్‌పల్లి

పైపులైన్ లీకేజీతో వృథాగా తాగునీరు





ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ జగద్గిరిగుట్ట ఇందిరాగాంధీ చౌరస్తాలో ప్రధాన రహదారిపై తాగునీటి పైపుల్లో నుంచి నీరు లీకై వృథాగా పోతోంది. పైప్‌లైన్ ప్రధాన రహదారిలో ఉండడంతో వాహనాల దుమ్ము దూళి పైపులైన్‌లోకి చేరి కలుషిత నీరు సరఫరా అవుతోంది. కొన్ని నెలలుగా పైపులైన్ లీకేజీ అవుతున్నా వాల్వ్ ఓపెన్ చేసే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ పైపులైన్ ద్వారానే కూకట్‌పల్లి పరిసర ప్రాంత ప్రజలందరికీ తాగునీరు సరఫరా అవుతుంది. ప్రజలు ఈ కలుషిత నీరు తాగి అనారోగ్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు.

– చిరుమర్తి రాజు, పాపిరెడ్డినగర్

కలుషిత నీరు సరఫరా అవుతోంది





ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీ బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఎదురుగా పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. దీంతో పాటు కలుషిత తాగునీరు సరఫరా అవుతోంది. కొన్ని రోజులుగా నీరు లీక్ అవుతోందని స్థానికులు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో నామమాత్రపు మరమ్మతులు చేపడుతుండడంతో సమస్య మళ్లీ పునరావృతం అవుతోంది. ఇప్పటికైనా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

–సువర్ణ, వివేకానందనగర్ కాలనీ